


కొత్త ఆలోచనలకు ఇన్‌స్పైర్

- విద్యార్థులకు సైన్స్ అధ్యయనం పట్ల ఆసక్తిని పెంపొందించడమే లక్ష్యం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 9 : అడవి జంతువుల బారీ నుంచి వ్యవసాయ పంటలను కాపాడుకోవడానికి క్షేత్రం చుట్టూ ఫినిషింగ్ ఏర్పాటు చేసి, రిమోట్‌తో ఆపరేట్ చేస్తే ఫలితం ఉంటుందని సైన్స్‌క్లాస్‌లో ఓ విద్యార్థి సూచించాడు. అతడిలో బాల మేధావి పురుడు పోసుకుంటున్నాడని గుర్తించిన ఉపాధ్యాయులు ఈ ఆలోచన 'ఇన్‌స్పైర్' ప్రోగ్రాంకు పంపించారు. ప్రభుత్వం సదరు ప్రతిపాదనను ఎంపిక చేసి రూ.10 వేలు నగదు అవార్డును అందించింది. దీంతో ఆ విద్యార్థి భావిశాస్త్రవేత్త తరహాలో జాతీయ స్థాయి పోటీలకు వెళ్లగలిగాడు. ఇలాంటి చిన్నారుల చురుకైన మెదళ్లలో మెదిలే ఆలోచనలకు ప్రోత్సాహాన్ని ఇవ్వడమే 'ఇన్‌స్పైర్' కార్యక్రమ లక్ష్యం. సమాజాభివృద్ధికి భావితరాలకు ఉపయోగపడే ఆలోచనలను చిన్నారుల చురుకైన మెదళ్లలో ప్రేరేపించడం, సైన్స్ అధ్యయనం పట్ల ఆసక్తిని పెంపొందించడం ఇన్‌స్పైర్ ప్రధాన లక్ష్యాలు. కేంద్ర ప్రభుత్వం 2008లో ఈ పథకాన్ని ప్రారంభించింది. ఆరో తరగతి నుంచి పోస్ట్ డాక్టోరల్ డిగ్రీ వరకు విద్యార్థుల కోసం మూడు పథకాల ద్వారా ఐదురకాల ప్రోగ్రాంలను అమలు చేస్తోంది.

ఇన్‌స్పైర్ అంటే..

ఇన్‌స్పైర్ అంటే 'ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ పర్స్యూట్ ఫర్ ఇన్‌స్పైర్డ్ రిసెర్చ్'. ఇది బేసిక్ నేచురల్ సైన్స్‌లకు సంబంధించి విద్యార్థుల్లో అభిరుచిని పెంపొందింపచేయడానికి సామర్థ్యాలను వృద్ధి చేయించ డానికి డీఎస్టీ ప్రారంభించిన కార్యక్రమమే ఇన్‌స్పైర్. ఇది అమలు చేసే మూడు పథకాల్లో మొదటి స్కీం ఫర్ ఎర్లీ అట్రాక్షన్ ఆఫ్ టాలెంట్ ఫర్ సైన్స్ (ఎస్ఈఏఈటీఎస్) ఇందులో రెండు ఉప కార్యక్రమాలు ఉన్నాయి. అవి ఇన్‌స్పైర్ అవార్డు-మనక్, ఇన్‌స్పైర్ ఇంటర్న్‌షిప్, రెండోది స్కాలర్‌షిప్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఎస్‌హెచ్ఈ). మూడోది అస్యూర్డ్ ఆపర్చునిటీ ఫర్ రిసెర్చ్ కెరియర్ (ఏఓఆర్‌సీ). ప్రస్తుతం పాఠశాల స్థాయి విద్యార్థుల కోసం మనక్ ప్రోగ్రాంకి ప్రకటన విడుదలైంది.

దేశవ్యాప్తంగా లక్ష అవార్డులు..

దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది బడుల నుంచి 10 లక్షల ఆలోచనలను సేకరించి అందులో ఉత్తమమైన లక్ష పరిష్కారాలను ఎంపిక చేస్తారు. వీటిని సూచించిన లక్ష మంది విద్యార్థులు జిల్లాస్థాయిలో జరిగే సైన్స్ ఎగ్జిబిషన్‌లలో పాల్గొనడానికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున అవార్డులను ప్రభుత్వం అందిస్తోంది. దీంతో విద్యార్థులు తమ ఆలోచనలకు నమూనాలను తయారు చేసి సదరు ఎగ్జిబిషన్‌లకు హాజరు కావాల్సి ఉంటుంది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో జిల్లాస్థాయిలో జరిగిన పోటీల నుంచి 10 వేల ఉత్తమ ఆలోచనలను గుర్తిస్తారు. వాటిని అందించిన విద్యార్థులు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనడానికి నమూనాలను తయారు చేయాల్సి ఉంటుంది. ఇందుకు అవసరమైన సాయాన్ని అందించేందుకు ప్రతి విద్యార్థికి ఒక మెంటార్‌ను నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్-ఇండియా (ఎన్ఐఎఫ్) ఇతర ప్రముఖ టెక్నాలజీ సంస్థలు ఏర్పాటు చేస్తాయి. ఆపై జాతీయ స్థాయిలో అంతిమంగా ఎంపికైన 60 ప్రాజెక్టులు రాష్ట్రపతి భవన్‌లో జరిగే వార్షికోత్సవ ఉత్సవాల్లో ప్రదర్శించబడుతాయి. ఇందులో పాల్గొన్న ప్రతి విద్యార్థికి రూ. 25 వేల చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమచేస్తారు.

- 6 నుంచి 10వ తరగతి చదివే బాలబాలికలకు అవకాశం..
- మూడు పథకాల ద్వారా ఐదు రకాల కార్యక్రమాల అమలు
- దేశ వ్యాప్తంగా లక్ష అవార్డులు
- 'మనక్'.. 15 సెప్టెంబరు ఆఖరు తేదీ

ఎలా చేయాలి అంటే..

ప్రతీ స్కూల్ కోడ్ నుంచి గరిష్ఠంగా ఐదు ప్రతిపాదనలను అప్‌లోడ్ చేసుకునే అవకాశం ఉంది. ఒక విద్యార్థి పంపిన ప్రతిపాదన జాతీయస్థాయి వరకు వెళ్తే తర్వాతి సంవత్సరాల్లో మళ్లీ పంపడానికి ఆస్కారం లేదు. ఆ ప్రతిపాదన ఏదైన కారణాలతో ఎంపిక కాకుంట పోతే మరో ఆలోచనతో అదే విద్యార్థి మళ్లీ ప్రయత్నించవచ్చు. తుది ప్రతిపాదనలను డీఎస్టీ పోర్టల్ (www.inspire awar ddst.gov.in.)లో అప్‌లోడ్ చేయాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో విద్యార్థులు తమ సృజనాత్మక ఆలోచనలను ఆచరణలో పెట్టి పరిశోధకులుగా ఎదగడానికి ఇదో ప్రత్యేక వేదికగా మారుతోంది.

'మనక్' ఎవరి కోసం..

ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠ శాలల విద్యార్థుల కోసం ఇన్‌స్పైర్-మనక్ (మిలియన్ మైండ్స్ ఆగ్మెంటింగ్ నేషనల్ యాస్పిరేషన్ అండ్ నాలెడ్జ్) ప్రోగాం రూపొందించారు. 2024-25 విద్యాసంవత్సరంలో ఇన్‌స్పైర్ అవార్డు మనాక్ కార్యక్రమంలో నామినేషన్లు సమర్పించడానికి సెప్టెంబరు 15 వరకు తుది గడువు ఉంది. అంటే.. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న పది నుంచి పదిహేను సంవత్సరాల వయస్సు ఉన్న బాలబాలికలు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. తద్వారా లక్ష మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుంది. తమ చుట్టుపక్కల పరిస్థితులు వాతావరణంలో ఎదురయ్యే రకరకాల సామాజిక సమస్యలకు విద్యార్థుల చురుకైన మెదళ్లలో మెదిలే పరిష్కారాలను వెలికితీయడమే 'మనక్' లక్ష్యం. దీనికోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థులు తాము గుర్తించిన సమస్యలకు తోచిన స్వంత పరిష్కారాలను తమ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు అందజేయాలి.



సృజనాత్మకతను వెలికితీసేందుకు..

బి.అప్పారావు, జిల్లా సైన్స్ అధికారి

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ కార్యక్రమాలు దోహదపడుతాయి. నాణ్యమైన, వినూత్నమైన ప్రదర్శనలు, ప్రాజెక్టులను రూపొందించేందుకు విద్యార్థులను ప్రోత్స హించాలి. ఉపాధ్యాయులు విద్యార్థుల ఆలోచనలకు మరింత మెరుగులు దిద్ది నాణ్యమైన సైన్స్ ప్రాజెక్టుల తయారికి ప్రోత్సాహం అందించాలి.



భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ప్రోత్సాహం..

పి.రామారావు, జిల్లా విద్యాశాఖాధికారి

విద్యార్థులు భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ప్రోత్సాహం కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం వైజ్ఞానిక ఆలోచనల నమూనాలను ప్రదర్శించేందుకు ఇన్‌స్పైర్ అవార్డు కార్యక్రమాన్ని తీసుకుంది. ఈ వేదిక ఉపయోగించుకోవడానికి ఇన్‌స్పైర్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, విద్యార్థుల నామినేషన్స్‌కు చివరి తేదీ సెప్టెంబరు 15 ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి రెండు, ఉన్నత పాఠశాలల నుంచి ఐదుగురు విద్యార్థులు ప్రదర్శనలు నామినేట్ చేయాలి. ఇతర సమాచారం కోసం జిల్లా సైన్స్ అధికారిని సంప్రదించాలి.



మా భూమిని కబ్జా చేస్తున్నారు సార్

- ఎమ్మెల్యే మురళీనాయక్‌కు చిన్నారుల మొర
- ఆధార్ కార్డులు లేక పథకాలకు దూరమవుతున్నామని ఆవేదన

వాంకుడోత్ ఐశ్వర్య, సంగీత

కేసముద్రం, జూలై 9 : 'మా భూమిని కబ్జా చేస్తున్నారు సార్.. మాకు పట్టాపాస్‌పుస్తకం ఇప్పించండి' అంటూ తండ్రిని కోల్పోయి.. తల్లి ఆలనాపాలనకు దూరమైన ఇద్దరు చిన్నారులు ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్న సంఘటన మంగళవారం మహబూబాబాద్ జిల్లాలో జరిగింది. కేసముద్రం జూనియర్ కళాశాలను పరిశీలించేందుకు మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ మంగళవారం వచ్చారు. ఈ క్రమంలో ఆయన వద్దకు వచ్చిన ఇద్దరు చిన్నారులు తమ భూమిని కబ్జా చేస్తున్నారని, తమకు న్యాయం చేయాలని కోరడం చర్చనీయాంశమైంది. దీనికి సంబంధించి చిన్నారుల బంధువులు తెలిపిన ప్రకారం. కేసముద్రం మండలం పెనుగొండ శివారు మర్రితండాకు చెందిన వాంకుడోత్ రవి-ఉమ దంపతులకు ఇద్దరు కూతుళ్లు. వారిలో ఐశ్వర్య ప్రస్తుత వయసు పదేళ్లు, సంగీత వయసు ఎనిమిదేళ్లు.

అయితే ఏడేళ్ల క్రితం తండ్రి రవి మృతి చెందగా, ఐదేళ్ల క్రితం తల్లి ఉమ ఇద్దరు పిల్లలను వదిలేసి హైదరాబాద్ వెళ్లిపోయింది. ఆ తర్వాత వారి బాగోగులను తాత బావుసింగ్ చూడగా.. కొంతకాలం తర్వాత ఆయన కూడా మృతి చెందడంతో వారి బాగోగులను బావుసింగ్ సోదరుడు, చిన్నారులకు చినతాత అయిన కిషన్ చూసుకుం టున్నాడు. ప్రస్తుతం తండాలోని ప్రాథమిక పాఠశాలలో 5, 3వ తరగతులు చదువుతున్న ఐశ్వర్య, సంగీతలకు వారసత్వంగా 12 గుంటల భూమి వచ్చింది. కానీ ఆ భూమిని చిన్నారుల బంధువుల్లో కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ఆ భూమిని వీరిపేరిట నమోదు చేసి పట్టాపాస్‌పుస్తకం ఇవ్వాలని బంధువులు కోరుతున్నారు. అంతేకాకుండా ఇరువురు చిన్నారులకు ఆధార్‌కార్డు లేకపోవడంతో హాస్టల్, ఇతర ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. దిక్కుతోచని స్థితిలో ఉన్న వీరికి హాస్టల్‌లో వసతికల్పించి, విద్యనందిం చాలని తండావాసులు కోరారు.

ఈ క్రమంలో మంగళవారం తమ పరిస్థితిని వారే స్వయంగా చెప్పడంతో స్పందించిన ఎమ్మెల్యే.. వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా విషయాన్ని తెలిపి చిన్నారులకు ప్రభుత్వం నుంచి సహకారాన్ని అందించాలని ఆదేశించారు.

మానుకోట నియోజకవర్గ ప్రగతే లక్ష్యం

- మునిసిపాలిటీ తాగునీటి కోసం రూ. 20 కోట్లు
- దసరా నాటి నుంచి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు
- మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, జూలై 9 : మానుకోట నియోజకవర్గ ప్రగతే లక్ష్యంగా అహర్నిశలు పని చేస్తానని స్థానిక శాసనసభ్యుడు భూక్య మురళీనాయక్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో పేదల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1964 సంవత్సరంలో అప్పటి జనాభాను దృష్టిలో పెట్టుకుని వేసిన పైపులైన్ ద్వారా మానుకోట మునిసిపాలిటీకి తాగునీటి సరఫరా అవుతోందని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ మిషన్ భగీరథ పథకం సత్ఫలితాలివ్వక పోగా, పూర్వంలో ఉన్న పైపులైన్ ద్వారానే నీటి సరఫరా చేస్తుండడంతో జిల్లా కేంద్రంలోని శివారు కాలనీలకు తాగునీటి సమస్య తలెత్తుందని వివరించారు. మహబూబాబాద్ మునిసిపాలిటీలోని ప్రతీ కాలనీకి పైపులైన్ వేసి, అన్ని ఇళ్లకు తాగునీరందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసిందన్నారు. నియోజకవర్గ పరిధిలోని కేసముద్రం, నెల్లికుదురు మండల కేంద్రాల్లో ప్రధాన రోడ్ల విస్తరణ, సెంట్రల్ డివైడర్లు, లైటింగ్, డ్రైనేజీ నిర్మాణం కోసం రూ.40 కోట్ల ప్రతిపాదనలు పెట్టినట్లు పేర్కొన్నారు. అదే విధంగా కేసముద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను డిగ్రీ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసుకున్నామని వివరించారు.

మానుకోట పట్టణానికి ఔటర్ రింగు రోడ్ మంజూరు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని, తద్వారా పట్టణంలో ట్రాఫిక్ సమస్యను నియంత్రించవచ్చని మురళీనాయక్ అన్నారు. ఇటీవలనే కేసముద్రం మీదుగా వేములవాడ, భద్రాచలం పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులను ప్రారంభించుకున్నామని గుర్తు చేశారు. ప్రతీ జిల్లా కేంద్రంలో 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అందుకు మానుకోటలో స్థల సేకరణ చేస్తున్నట్లు చెప్పారు. ఆగస్టు 15 లోపు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేసి తీరుతుందని స్పష్టం చేశారు. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు, అయ్యాయని దసరా పర్వదినం నాటి నుంచి నిర్మాణాలను ప్రారంభించనున్నట్లు చెప్పారు. నియోజవర్గ పరిధిలోని ప్రతీ మండలానికి 500 ఇందిరమ్మ ఇళ్ల చొప్పున ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అందుకు సహకరిస్తున్న సీఎం సలహదారులు వేం.నరేందర్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి చుక్కల ఉదయ్‌చందర్, గుగులోతు దస్రూనాయక్, ఖలీల్‌పాషా, ఎడ్ల రమేష్, అంబటి మహేందర్‌రెడ్డి, అల్లం నాగేశ్వర్‌రావు, పోతురాజు రాజు, మిట్టకంటి రాంరెడ్డి, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, రజనికాంత్, శ్రీను పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంకులో పడిన బాలుడు

- పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం
- బాధితుడు కురవి మండలం సూదనపల్లివాసి



సెప్టిక్ ట్యాంకులో పడ్డ బాలుడిని అంబులెన్స్‌లో కరీంనగర్‌కు తరలిస్తున్న సిబ్బంది

పెద్దపల్లి టౌన్, జూలై 9 : పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఓ బాలుడి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. దవాఖాన ఆవరణలోని సెప్టిక్ ట్యాంక్ మూత తెరిచి ఉంచడంతో మంగళవారం ఉదయం 9 ఏళ్ల బాలుడు అందులో పడిపోయాడు. అతడి పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం సూదనపల్లికి చెందిన శ్రీనివాస్-రాములమ్మ దంపతులు కూలీ పనుల కోసం పెద్దపల్లికి వచ్చారు. సోమవారం శ్రీనివాస్‌కు జ్వరం రావడంతో పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందు తున్నాడు. వారితోపాటు వారి తొమ్మిదేళ్ల కుమారుడు విలియమ్స్ దవాఖానలోనే ఉన్నాడు. ఉదయం టాయిలెట్

మిగతా 8వ పేజీలో..

ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

- జీపీ బిల్లుల చెల్లింపునకు రూ.50వేల డిమాండ్
- అవినీతి నిరోధక శాఖను ఆశ్రయించిన బాధితుడు
- వల పన్ని పట్టుకున్న అధికారులు



కంచనపల్లి కార్యదర్శి పడిగె శివాజీని అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు

రఘునాథపల్లి, జూలై 9: నెల నెలా రంచన్‌గా వేలల్లో జీతం.. ఆపై అప్పుడప్పుడు దొరికే అమ్యామ్యాలు.. అయినా అతడిలో డబ్బుపై ఆశ చావలేదు. అత్యాశకుపోయి చివరికి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళితే.. రఘునాథపల్లి మండలం కంచనపల్లి గ్రామ మాజీ సర్పంచ్ గవ్వాని విజయ భర్త నాగేశ్వరరావు గతంలో జీపీ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేశారు. వాటికి సంబంధించి రూ.1.53 లక్షలు జీపీ జనరల్ ఫండ్ నుంచి రావాల్సి ఉంది. అయితే వాటిని చెల్లించేందుకు కార్యదర్శి శివాజీని సంప్రదించగా, రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతకాకుండా రూ.20 వేలు ఇచ్చేందుకు నాగేశ్వర్‌రావు ఒప్పుకున్నారు. ఆ తర్వాత డబ్బుల కోసం పలుమార్లు శివాజీ ఒత్తిడి చేశారు. దీంతో విసుగు చెందిన నాగేశ్వర్‌రావు వరంగల్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు.

డీఎస్పీ సాంబయ్య సూచనల ప్రకారం నాగేశ్వరరావు మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వెనుక ఉన్న చెట్టు వద్దకు వచ్చారు. అక్కడ కార్యదర్శి శివాజీ రూ.20 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకుని శివాజీని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య, ఇన్‌స్పెక్టర్లు శ్యాంసుందర్ రెడ్డి, సట్ల రాజు, ఎల్.రాజు తదితరులు పాల్గొన్నారు.

విసుగొచ్చి ఏసీబీని ఆశ్రయించా..: గవ్వాని నాగేశ్వరరావు, బాధితుడు

చేసిన పనులకు బిల్లులు చెల్లించేందుకు గ్రామ కార్యదర్శి శివాజీ లంచం డిమాండ్ చేయడం.. ఈ విషయంలో పలుమార్లు ఒత్తిడి తేవడంతో భరించలేక ఏసీబీని ఆశ్రయించా. జూలై 2023 నుంచి చేసిన పనుల కోసం ఖర్చు చేసిన రూ.1.53 లక్షలు జీపీ జనరల్ ఫండ్ నుంచి ఇచ్చేందుకు కార్యదర్శి శివాజీ లంచం అడిగారు. ఏసీబీ అధికారులు అండగా ఉంటామని చెప్పడంతో పంచాయతీ కార్యదర్శిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టించా.

లంచం అడిగితే సమాచారం ఇవ్వండి..

అధికారులు ఏదైన పని కోసం లంచం అడిగితే టోల్‌ఫ్రీ నెంబరు 1064కు సమాచారం ఇవ్వాలని వరంగల్ ఏసీబీ డీఎస్పీ పి.సాంబయ్య సూచించారు. లంచం తీసుకోవడంతో పాటు ఇవ్వడం కూడా నేరమని గుర్తించుకోవాలన్నారు. ఎవరైనా అధికారులు లంచం కోసం వేధిస్తే తమను సంప్రదించాలని కోరారు.



మహబూబాబాద్ శివారు గుండ్లబోడుతండా సీత్లా వేడుకలో పూజలు చేస్తున్న సేవాలాల్ సేన బాధ్యులు

భక్తిశ్రద్ధలతో సీత్లా పండుగ

- అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించిన గిరిజనులు
- ప్రకృతిని ఆరాధిస్తూ కులదేవతకు మొక్కులు
- ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే మురళీనాయక్

7 లో..



వీసీలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, అధికారులు

లక్ష్యాల కనుగుణంగా మొక్కలు నాటాలి

- వీసీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

మహబూబాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : వనమహోత్సవంలో లక్ష్యాల కనుగుణంగా మొక్కలు నాటాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. హైదరాబాద్ నుంచి వనమహోత్సవం, మహిళా శక్తిక్యాంటీన్లు, ప్రజాపాలన సేవాకేంద్రాలు, అమ్మ ఆదర్శపాఠశాలలు, వ్యవసాయం, వైద్యం, ధరణి, ఉద్యోగుల బదిలీలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వనమహోత్సవం ప్లాంటేషన్, జియోట్యాగింగ్, మహిళా శక్తి క్యాంటీన్లు, సీజనల్ వ్యాధులు, ధరణి, పారదర్శకంగా బదిలీలు లాంటి అంశాలపై సమీక్షించి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. వీసీ అనంతరం కలెక్టర్ అద్వైత్ కుమార్ సంబంధిత జిల్లా అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఎలాంటి పెండింగ్‌లు, జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, ఎం.డేవిడ్, అటవీశాఖ అధికారి బత్తుల విశాల్, ఆర్డీవోలు అలివేలు, నర్సింహారావు, జిల్లాఅధికారులు నర్మద, హరిప్రసాద్, డాక్టర్ కళావతిబాయి, అభిమన్యుడు, రామారావు, వెంకటరమణ పాల్గొన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం



మానుకోటలో రామమందిరం వద్ద రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

మహబూబాబాద్ అగ్రికల్చర్, జూలై 9 : జిల్లాలో మంగళవారం సాయంత్రం నుంచి వర్షం కురుస్తోంది. ఈ వానాకాలం సీజన్‌లో అడపాదడపా వానలే తప్ప, అనుకున్నంత భారీ వర్షాలు కురియలేదు. నర్సింహులపేట మండలంలో భారీ వర్షం కురియగా, డోర్నకల్ మండలంలో ఓ మోస్తారు వాన పడింది. కేసముద్రం, నెల్లికుదురు, చిన్నగూడూరు, బయ్యారం, దంతాలపల్లి, కొత్తగూడ, మరిపెడ, తొర్రూరు మండలాల్లో ముసురు కురుస్తోంది. దట్టంగా మబ్బులు చేసి ఉండడంతో రాత్రి భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి. జిల్లాలో సోమవారం నుంచి మంగళవారం ఉదయం వరకు ఇంటిగ్రేటెడ్ వర్షపాతం 1.9 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. కొత్తగూడలో 2.1 మిల్లీమీటర్లు, గంగారంలో 3.1, బయ్యారంలో 0.4, గార్లలో 1.1, డోర్నకల్‌లో 0.2, మహబూబాబాద్‌లో 2.1, గూడూరులో 2.0, కేసముద్రంలో 0.3, నెల్లికుదురులో 3.8, మరిపెడలో 17.7, ఇనుగుర్తిలో 1.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

భార్యను చంపి భర్త ఆత్మహత్య



చరణ్, స్వప్న(ఫైల్)

- కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులే కారణం
- ముగ్గురు పిల్లల్ని బావమరిది ఇంటికి పంపి దుశ్చర్య
- తల్లిదండ్రులను కోల్పోయి దిక్కుతోచని స్థితిలో చిన్నారులు
- కంటతడి పెట్టించిన చిన్నారుల రోదన
- వరంగల్‌లోని చెన్నారెడ్డినగర్‌లో విషాదం

7 లో..



శాంతి భద్రతలే లక్ష్యంగా..

కమిషనరేట్ పరిధిలో సీపీ ప్రత్యేక దృష్టి

ఠాణాల ఆకస్మిక తనిఖీలు

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌పై ఫోకస్



హనుమకొండ స్టేషన్ తనిఖీ చేస్తున్న సీపీ(ఫైల్)



అర్ధరాత్రి సీపీ నగరంలో పెట్రోలింగ్ (ఫైల్)


వరంగల్ క్రైం, జూలై 9: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా సీపీ అంబర్ కిషోర్ ఝా నడుబిగించారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలను ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంతంగా నిర్వహించిన ఆయన స్టేషన్లలో పోలీస్ అధికారులు అందుబాటులో ఉండాలని గతంలోనే ఆదేశించారు. ఈ క్రమంలో తరచూ పోలీస్‌స్టేసన్లను తనిఖీ చేయడంతో పాటు కమిషనరేట్‌కు వచ్చిన బాధితుల సమస్యలను స్వయంగా తెలుసుకుంటున్నారు. అప్పటికప్పుడు పలు సమస్యలను పరిష్కరిస్తున్న ఆయన పోలీస్ అధికారులపై వచ్చిన ఆరోపణలను పరిగణనలోకి తీసుకుని అటాచ్ చేయడం, స్టేషన్లు మార్చి పోస్టింగ్‌లు ఇస్తున్నారు. గంజాయి, బెల్టు షాపుల నియంత్రణకు చర్యలు చేపట్టారు. మొత్తంగా గతంలో కమిషనరేట్ పరిధిలో పనిచేసిన అనుభవంతో అంబర్ కిషోర్ ఝా శాంతి భద్రతల పరిరక్షణకు పక్కా ప్రణాళికలతో వెళుతున్నారు.

ఆకస్మిక తనిఖీలతో హడల్

పలు స్టేషన్‌లలో ఎస్‌హెచ్‌వోలు అందుబాటులో ఉండటం లేదని, పిర్యాదులను పెండింగ్‌లో పెడుతున్నారని, బాధితుల పట్ల పోలీసుల ప్రవర్తన బాగోడం లేదన్న ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఆయన కమిషనరేట్ పరిధిలోని స్టేషన్ల తనిఖీ చేపట్టి ఉద్యోగులను హడలెత్తించారు. ఆకస్మిక తనిఖీల్లో స్టేషన్ సిబ్బంది హాజరు, ఆరోజు వచ్చిన ఫిర్యాదులు, పెండింగ్ కేసుల వివరాలు తదితర విషయాలను పరిశీలిస్తున్నారు. అందుబాటులో ఉండని సిబ్బందికి వార్నింగ్ ఇచ్చారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు సీఐలు, ఎస్‌ఐలను ఇటీవల అటాచ్ చేసిన విషయం తెలిసిందే. అలాగే కమిషనరేట్ పరిధిలో అర్ధరాత్రి వేళ హటాత్తుగా రోడ్లపై పెట్రోలింగ్ చేస్తున్నారు. రెండు రోజుల క్రితం అంబర్ కిషోర్ ఝా ట్రై సిటీస్‌లో అర్ధరాత్రి పెట్రోలింగ్ చేసి హడలెత్తించారు. వరంగల్ మండిబజార్ నుంచి వరంగల్ చౌరస్తా వరకు తనిఖీలు చేసారు. వ్యాపారస్తులు సకాలంలో షాపులు బంద్ చేయాలని సూచించారు. రోడ్లపై వాహనాల తనిఖీలు సైతం చేసిన అంబర్ కిషోర్ ఝా అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించాలని అధికారులకు ఆదేశించారు. కాజీపేట రైల్వే పోలీస్ స్టేషన్‌కు ఆకస్మికంగా వెళ్లిన ఆయన రైల్వేస్టేషన్‌లో తరచూ సంచరించే అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించాలని సూచించారు. కమిషనర్ ఆకస్మిక తనిఖీలతో అధికారులు అప్రమత్తమయ్యారు. స్టేషన్లలో సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉన్నట్టు కనిపిస్తోంది.

ట్రాఫిక్‌పై ప్రత్యేక శ్రద్ధ

కాగా శాంతి భద్రతలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిన అంబర్ కిషోర్ ట్రాఫిక్ నియంత్రణకు కూడా చర్యలు చేపట్టారు. నయీంనగర్ నాలా పనులు జరుగుతుండటంతో ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ సూచిక బోర్డులు ఏర్పాటు చేయించడంతో పాటు ఆ ప్రాంతంలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులను నియమించారు. మర్కజీ పాఠశాల జంక్షన్ వద్ద డివైడర్లతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఫిర్యాదు అందడంతో స్వయంగా వెళ్లిన పోలీస్ కమిషనర్ వెంటనే డివైడర్‌ను తొలగించి సమస్యకు పరిష్కారం చూపి.. నూతన సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేసారు. వాహనాల తనిఖీలు చేపట్టి పత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించడం, వాహనాలు సీజ్ చేయాలని ట్రాఫిక్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



యుద్ధాలు మానవాళి మనుగడకు ప్రమాదకరం

ఎంసీపీఐ (యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్



సమావేశంలో మాట్లాడుతున్న మద్దికాయల అశోక్

సుబేదారి, జూలై 9: యుద్ధాలు మానవాళి మనుగడకు ప్రమాదకరమని ఎంసీపీఐ (యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ అన్నారు. ఎంసీపీఐ (యూ) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ రెండు రోజుల సమావేశాలు హనుమకొండ సుబేదారిలోని రాఘవేంద్ర గార్డెన్స్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పెద్దారపు రమేష్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. సమావేశంలో తొలుత పాలస్తీనా, గాజాపై ఇజ్రాయిల్ దేశం సాగిస్తున్న నరమేధంలో, ఉక్రెయిన్, రష్యా దాడుల్లో మరణించిన వారికి, ఇటీవల వివిధ ప్రమాదాల్లో మృతి చెందిన వారికి, ఆత్మహత్యలు చేసుకున్న రైతులకు, నిరుద్యోగులకు, హత్రాస్ తొక్కిసలాటలో మరణించిన వారికి మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మద్దికాయల అశోక్ మాట్లాడుతూ ప్రపంచంలో శాంతి సౌభ్రాతృత్వం నెలకొల్పి శాంతియుత సహజీవనం కొనసాగించాల్సిన ప్రపంచ దేశాల్లో అమెరికా లాంటి సామ్రాజ్యవాద దేశాలు ఇతర దేశాల సార్వభౌమాధికారంలో జోక్యం చేసుకుంటున్నాయని అన్నారు. సమావేశంలో ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కుంభం సుకన్య, వస్కుల మట్టయ్య, వనం సుధాకర్, గోనె కుమారస్వామి, ఎన్‌రెడ్డి హంసారెడ్డి, మంద రవి, నాగార్జున పాల్గొన్నారు.

కార్మిక కుటుంబాలకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉప్పలయ్య

కాజీపేట, జూలై 9 : మున్సిపల్ కార్పొరేషన్‌లో విధినిర్వహణలో మృతి చెందిన పారిశుధ్య కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబీకులకు వెంటనే ఉద్యోగాలు కేటాయించాలని, కార్పొరేషన్ ప్రకటించిన రూ 1 లక్ష 50 వేలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య డిమాండ్ చేశారు. కాజీపేట మినీ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ సిబ్బంది, సీఐటీయూ నాయకులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టి.ఉప్పలయ్య మాట్లాడారు. మున్సిపాలిటీలో ఔట్‌సోర్సి ంగ్‌లో పనిచేస్తూ మరణించిన కార్మిక కుటుంబాలకు కార్పొరేషన్ తీవ్ర అన్యాయానికి గురుచేస్తుందన్నారు. మృతుల కుటుంబీకుల ఉద్యోగాలు ఇవ్వాల్సిన కార్పొరేషన్ కమిటీల పేరుతో కాలయాపన చేస్తుందని విమర్శించారు. కార్మిక కుటుంబాలు కమిటీలను రద్దు చేయాలని డిమాండ్ చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

యువత మత్తుకు బానిస కావొద్దు

పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

హనుమకొండ టౌన్, జూలై 9 : యువత మత్తుకు బానిస కావొద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పిలుపునిచ్చారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆచార్య రవి రూపొందించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం సీపీ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. మత్తు పదార్థాలతో యువత భవి ష్యత్ నాశనం కావడమే కాకుండా ఎన్నో కుటుంబాలు ఛిద్రం అవుతున్నాయని, వాటికి దూరంగా ఉండి జీవితంలో ఉన్నతమైన స్థితికి చేరుకోవాలని సూచించారు.

జడ్పీలో బదిలీల ప్రక్రియ షురూ

హనుమకొండ సిటీ, జూలై 9 : జిల్లా పరిషత్‌లో బదిలీల ప్రక్రియ ఆరంభమైంది. అన్ని విభాగాల ఉద్యోగుల బదిలీ ప్రక్రియను అధికా రికంగా చేపట్టారు. ఇందులో భాగంగా ఉద్యోగుల నుంచి ఆగస్టు 12 వర కు బదిలీ దరఖాస్తులను అధికారులు స్వీకరిస్తున్నారు. బదిలీలు జరుగ నుండడంతో జడ్పీలో ఉద్యోగుల సందడి నెలకొంది.

ఎంజీఎంలో డీఎంహెచ్‌వో తనిఖీ

వరంగల్ మెడికల్, జూలై 9 : వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట రమణ మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ నెల 6వ తేదీన జిల్లా కలెక్టర్ ఎంజీఎం ఆస్పత్రిని తనిఖీ చేసిన సందర్భంలో ఆదేశించిన విధంగా ఆస్పత్రిలో స్టార్టింగ్ ఓపీ, సీసీ కెమెరాలు ఏర్పాటు, ఓసీలో కుర్చీల ఏర్పాటు తదితరాలపై తనిఖీ చేశారు. అనంతరం ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్‌ను కలిసి మాట్లాడిన అనంతరం జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేసినట్లు తెలిసింది.

కేయూ ఇంజనీరింగ్ డీన్ బదిలీ

కేయూ క్యాంపస్, జూలై 9: కాకతీయ యూనివర్సిటీ ఇంజనీరింగ్ విభాగం డీన్, కేయూ మహిళ, కో ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మంచాల సదానందంను వర్సిటీ కళాశాల నుంచి కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాలకు బదిలీ అయ్యారు. ఈ మేరకు కేయూ ఉన్నతాధికారులు సదానందంను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. సదానందం బదిలీతో వర్సిటీ క్యాంపస్‌లోని రెండు ఇంజనీరింగ్ కళాశాలలకు తాత్కాలికంగా ఇద్దరూ అసిస్టెంట్ ప్రొఫెసర్లను ఇన్‌చార్జిలుగా నియమించినట్లు తెలిసింది. అయితే ప్రొఫెసర్ సదానందం తన తమ్ముడికి ఆరోగ్యం బాగా లేదని బదిలీ తాత్కాలికంగా అపాలని వర్సిటీ ఉన్నతాధికారులను కలిసి విన్నవించినట్లు తెలిసింది. తక్షణమే వర్సిటీ కళాశాల నంచి రీలివై కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాలలో జాయిన్ కావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు తెలిసింది.

ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలి

యుఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మాలోత్ రాజేశ్‌నాయక్

హనుమకొండ టౌన్, జూలై 9 : ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని యుఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మాలోత్ రాజేశ్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం లష్కర్ బజార్‌లోని ప్రాక్టిసింగ్ ప్రైమరీ పాఠశాల, ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులు ఎదుర్కొం టున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భరంగా రాజేశ్‌నాయక్ మాట్లాడుతూ.. పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, స్కావెంజర్స్ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతు న్నార న్నారు. జిల్లా అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు అధ్యాయనం చేసి పరిష్కరించే విధంగా కృషి చేయాలన్నారు. పూర్తి స్థాయి ఉపాధ్యాయులు లేక, ఇన్‌చార్జి హెచ్‌ఎంలతో విద్యార్థులకు తీరని నష్టం జరుగుతుందని వెంటనే సరిపడా ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుఎస్‌ఎఫ్‌ఐ టౌన్ సెక్రెటరీ హరీశ్, జిల్లా నాయకులు రాజేశ్, రాకేశ్, శివ పాల్గొన్నారు.





భార్యను చంపి భర్త ఆత్మహత్య

- కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులే కారణం
- ముగ్గురు పిల్లల్ని బావమరిది ఇంటికి పంపి దుశ్చర్య
- తల్లిదండ్రులను కోల్పోయి దిక్కుతోచని స్థితిలో చిన్నారులు
- సోమవారం రాత్రి దారుణం.. మంగళవారం ఉదయం వెలుగులోకి
- కంటతడి పెట్టించిన చిన్నారుల రోదన
- వరంగల్‌లోని చెన్నారెడ్డినగర్‌లో విషాదం



స్వప్న మృతదేహం



బిక్కుబిక్కుమంటూ ఉన్న ముగ్గురు పిల్లలు

ఖిలావరంగల్, జూలై 9: ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు ఆ ఇంట్లో చిచ్చురేపాయి.. దీంతో జీవితంపై విరక్తి చెందిన భర్త భార్యను చంపి.. ఆ తర్వాత తానూ ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఆ తల్లిదండ్రులను కోల్పోయిన ముగ్గురు చిన్నారులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ విషాదకర ఘటన వరంగల్ నగరంలోని 18వ డివిజన్ చెన్నారెడ్డి కాలనీలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

చెన్నారెడ్డికాలనీకి చెందిన మంద చరణ్ (45), మంద స్వప్న(40) దంపతులకు 18ఏళ్ల క్రితం వివాహం జరగ్గా, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు జన్మించారు. కుమారుడు అంధత్వంతో బాధపడుతుండగా చరణ్ భవన నిర్మాణ మేస్త్రీగా, స్వప్న కూరగాయల మార్కెట్‌లో కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కానీ కొద్దిరోజుల నుంచి చరణ్, స్వప్న దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. వాటికి ఆర్థిక ఇబ్బందులు కూడా తోడయ్యాయి. ఈ క్రమంలోనే సోమవారం సాయంత్రం చరణ్ తన ముగ్గురు పిల్లలను వరంగల్‌లోని ఉర్సు ప్రాంతంలో నివాసం ఉండే తన బావమరిది ఇంట్లో దింపేసి వచ్చాడు. రాత్రి ఇంట్లో చరణ్, స్వప్న దంపతులు మాత్రమే ఉండగా రాత్రివేళ ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈక్రమంలో ఆగ్రహావేశానికి లోనైన చరణ్ రోకలి బండతో స్వప్నపై దాడి చేయడంతో తలకు బలమైన గాయమై స్వప్న మృతి చెందింది. ఆమె చనిపోయినట్టు నిర్ధారించుకున్నాక అప్పటికే తాను తెచ్చుకున్న పురుగుల మందును తాగి చరణ్ ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం తమ మామయ్య ఇంటి నుంచి ఆటోలో తిరిగి వచ్చిన ముగ్గురు పిల్లలు తల్లి రక్తపు మడుగులో, తండ్రి విగతజీవిగా కనిపించడంతో భయంతో బిగ్గరగా కేకలు వేస్తూ ఏడ్చారు. చిన్నారుల ఏడుపు విన్న స్థానికులు అక్కడికి చేరుకుని 100కి డయల్ చేసి సమాచారమివ్వగా మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య, వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, క్లూస్ టీం ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు మార్చురీకి తరలించారు. మృతుడి పెద్ద కుమార్తె గ్రేసీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

దిక్కుతోచని స్థితిలో చిన్నారులు..

తల్లిదండ్రులు కోల్పోయిన ముగ్గురు పిల్లలు దిక్కుతోచని స్థితిలో మిగిలారు. పెద్దకుమార్తె గ్రేసీ ఏడో తరగతి వరకు చదువుని ఇంట్లోనే ఉంటోంది. చిన్న కుమార్తె మెర్సీ గుండెకు రంధ్రం ఉండటంతో ఆపరేషన్ చేయించే పరిస్థితి లేక తరచూ అనారోగ్యంతో బాధపడుతూ ఆమె కూడా స్కూల్‌కు వెళ్లడం లేదు. ఇక ఒక్కగానొక్క కుమారుడు శాలూమ్ కూడా అంధుడు కావడంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. తమ కుటుంబ దీన స్థితికి తోడు ఆర్థిక సమస్యలు చుట్టుముట్టడం, ఈ క్రమంలోనే భార్యాభర్తల మధ్య కలహాలు ప్రారంభం కావడంతో ఆత్మస్థైర్యం కోల్పోయి, జీవితంపై విరక్తితో చరణ్ ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటాడని బంధువులు, స్థానికులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

కంటతడిపెట్టించి చిన్నారుల రోదన

తమ మామయ్య ఇంటి నుంచి ఆనందంగా ఇంటికి వచ్చిన గ్రేసీ, మెర్సీ, శాలూమ్ ఇంటి తలుపు తీయగా తల్లిదండ్రులు చనిపోయి కనిపించడంతో కన్నీరుమున్నీరుగా విలపించడం అక్కడివారిని కంటతడి పెట్టించింది. ఇంటిముందు నిలబడి 'అమ్మా..నాన్నా..' అంటూ విలపించడం అక్కడి వారిని కలిచివేసింది.

ఔదార్యం చాటుకున్న పోలీసులు

కరీమాబాద్ : మిల్స్‌కాలనీ పోలీసులు ఔదార్యాన్ని చాటుకున్నారు. లేబర్‌కాలనీకి చెందిన మంద చరణ్-స్వప్న దంపతులు మృతిచెందడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న ముగ్గురు చిన్నారులను చూసి చలించిపోయారు. ముఖ్యంగా శాలూమ్ అంధుడు కావడంతో స్పందించిన సీఐ మల్లయ్య రూ.10వేలు, ఎస్సైలు చందర్, శ్రీకాంత్ రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. అలాగే 18వ డివిజన్ కార్పొరేటర్ వస్కుల బాబు, కాంగ్రెస్ నాయకుడు గడ్డమీది రాజేష్ రూ.5వేలు, మాజీ కార్పొరేటర్ కుందారపు రాజేందర్ రూ. 5వేలు అందించి మానవత్వంచాటుకున్నారు.

భక్తిశ్రద్ధలతో సీత్లా పండుగ

ప్రత్యేక పూజలు చేసిన మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్



మహబూబాబాద్ శివారు వీరారంతండా సీత్లాపండుగ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 9 : మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా మంగళవారం గిరిజనులు సీత్లా పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. యావత్ గిరిజన జాతిమొత్తం ఒకేరోజు పండుగను ఆనందోత్సవాల నడుమ నిర్వహించుకున్నారు. సీత్లాభవాని ఘాట్ వద్దకు గిరిజన మహిళలు సంప్రదాయబద్ధంగా నైవేద్యాలు (పాయసం)తో పాటు ప్రత్యేక వంటకాలు చేసుకుని సీత్లాభవాని అమ్మవారికి సమర్పించారు. ఆట, పాటలతో నృత్యాలు చేస్తూ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ప్రతీ గిరిజన తండాల్లో చిన్నాపెద్ద అనే తారతమ్యం లేకుండా ఈ వేడుకల్లో పాల్గొని, ప్రకృతిని ఆరాధిస్తూ కులదేవతను పూజించారు.

- మహబూబాబాద్ శివారు వీరారంతండాలో నిర్వహించిన వేడుకల్లో సీత్లాభవాని అమ్మవారికి స్థానిక శాసన సభ్యులు భూక్య మురళీనాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ భూక్య శ్రీను, డాక్టర్ బానోత్ నెహ్రూరాథోడ్ పాల్గొన్నారు. గుండ్లబోడుతండాలో నిర్వహించిన వేడుకల్లో సేవాలాల్ సేనా రాష్ట్ర కోకన్వీనర్ వెంకన్ననాయక్, నాయకులు మోతీలాల్, బన్సీలాల్, శంకర్, బాలు,చంద్రు, లింగన్న, రవి, భద్రు, మాలు, సంజీవ, శ్రీను, రమేష్, మంగిలాల్, సరిత, మౌనికబాయి, మీనా, శారద, సునీత పాల్గొన్నారు. వినాయకతండాలో సీత్లాపండుగను పురస్కరించుకుని సీత్లాభవానికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో బానోత్ శంకర్‌నాయక్, దారావత్ హంక్లా, బానోత్ సక్రాం, సురేష్, విజయ్, రమేష్, బిచ్యా, వస్రం పాల్గొన్నారు.



మహబూబాబాద్ వినాయక తండాలో సీత్లాభవానికి నైవేద్యం సమర్పించేందుకు వెళ్తున్న తండవాసులు

వివిధ మండలాల్లో..

మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని బోడ అమృతండ, సబ్‌స్టేషన్‌తండ, లోక్యతండ, జామతండ, అర్లగడ్డతండ, నేతావత్‌తండ, లూనావత్‌తండతో అన్ని గిరిజన గూడాల్లో సీత్లాపండగ వేడుకలు నిర్వహించారు.

- దంతాలపల్లి మండలంలోని తూర్పుతండ, దుబ్బతండ, రెక్యతండాలో గిరిజనులు సీత్లాభవాని పండుగ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అంజి, నాయకులు పాల్గొన్నారు.
- గూడూరు మండలం సీతానగరం శివారు రాళ్లవాగు దస్రు తండ, ఏపూరు గ్రామాల్లో సీత్లాభవాని వేడుకలు నిర్వహించారు. భూక్య మంగీలాల్, లక్ష్మణ్, వాంకుడోతు గోపీనాథ్, వాంకుడోతు మోతీలాల్, శ్రీను, రమేష్, సురేష్, బిచ్చు, సర్దార్, బాబు, రాములు, వెంకటేష్, గోపిచంద్ పాల్గొన్నారు.
- బయ్యారం మండలంలోని అన్ని లంబాడ గిరిజన తండాల్లో, గూడాల్లో సీత్లాభవాని వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో తండా పెద్దలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.
- చిన్నగూడూరు మండలం మేగ్యతండాలో నిర్వహించిన వేడుకల్లో తండాపెద్ద బాదావత్ రెడ్డి, బాను, చంద్రు, సురేష్, జ్యోతిరాము, భూక్య వెంకన్న, చిరంజీవి, రాంబాబు, శంకర్, శివ, సాయిరాం, రవి, మల్లేశ్వర్, దస్రూ పాల్గొన్నారు.
- సీరోలు మండలం కాంపల్లి సక్రాంనాయక్‌తండాలో నిర్వహించిన వేడుకల్లో తేజావత్ రవీందర్, బిచ్చు, ఈశ్వర్, సేట్యా బానోత్ వీరన్న, తేజావత్ వీరన్న, నరేష్, రాములు, సతీష్ పాల్గొన్నారు.
- పెద్దవంగర మండలంలో సీత్లాభవాని వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజలలో పాల్గొని నైవేద్యాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. పానుగోతు ప్రదీప్ ఎనాయక్, రఘులాల్‌నాయక్, రామచంద్రు, అమర్‌సింగ్, ధూమా, ప్రవీణ్, కల్యాణి, మంగమ్మ, మహిళలు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి టూ-డే క్రికెట్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్, జూలై 9 : వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం వరంగల్‌లోని దేశాయిపేట సీకేఎం కళాశాల క్రీడా మైదానంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి టూ-డే క్రికెట్ లీగ్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూలై రెండవ వారం నుంచి హైదరాబాద్ నగరంలో నిర్వహించనున్న టూ-డే క్రికెట్ లీగ్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. 25 సంవత్సరాల వయస్సు లోపు, 31 ఆగస్టు 1999 సంవత్సరం తర్వాత పుట్టిన ఔత్సాహిక క్రికెట్ క్రీడాకారులు అర్హులను తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈనెల 11న ఉదయం 10గం టలకు సీకేఎం కళాశాల క్రీడా మైదానంలో రిపోర్టు చేయాలని శ్రీనివాస్ వెల్లడించారు. మరిన్ని వివరాలకు-98495 70979 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

హనుమకొండ ఎఫ్ఏసీ డీఈవోగా వాసంతి

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 9 : హనుమకొండ జిల్లా విద్యాశాఖాధికారిగా డి. వాసంతికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ విద్యాశాఖ డైరెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం డీఈవోగా పనిచేస్తున్న డాక్టర్ ఎండి. అబ్దుల్ హై అనారోగ్యానికి గురికావడంతో ఆయన రెండు నెలల పాటు సెలవు పెట్టారు. దీంతో వరంగల్ ఎఫ్ఏసీ డీఈవోగా పనిచేస్తున్న డి.వాసంతికి హనుమకొండ బాధ్యతలు అప్పగించారు.

అడవి బిడ్డలకు అక్షరాభ్యాసం

- గొత్తికోయగూడెంలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు
- ప్రారంభించిన మంత్రి సీతక్క
- చిన్నారి తులసి కోరిక మేరకే నిర్మించామని వెల్లడి



స్కూల్ భవనం ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

మేడారం, జూలై 9: మారుమూల అటవీ ప్రాంతంలో.. గొత్తికోయ బిడ్డలు చదువుకోనేలా మంత్రి సీతక్క చూపిన చొరవ చూపడంతో సర్కారు పాఠశాల ప్రారంభమైంది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సాంస్కృతిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హాజరయ్యారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం నార్లాపూర్ పంచాయతీ పరిధి గొత్తికోయగూడెమైన తక్కెళ్లపల్లి గూడేనికి చెందిన చిన్నారి పూణెం తులసి ఆ కార్యక్రమంలో నాటిక ప్రదర్శన ఇవ్వగా.. ఆమె ప్రదర్శనను మెచ్చిన మంత్రి సీతక్క 'నీకేం కావాలి తల్లీ' అని ఆ చిన్నారిని సీతక్క అడగ్గా 'మా గ్రామానికి పాఠశాల కావాలి' అని ఆ చిన్నారి టక్కున సమాధానం ఇచ్చింది. అందుకు మంత్రి స్పందించి పాఠశాల నిర్మాణానికి ముందడుగు వేశారు. దాతల ఆర్థిక సహకారం, పోలీసు శాఖ పర్యవేక్షణలో నిర్మితమైన ఆ పాఠశాల భవనం మంత్రి సీతక్క చేతుల మీదుగా మంగళవారం ప్రారంభమైంది. ములుగు ఎస్పీ శబరీశ్, ఓఎస్డీ మహేష్ గీతెతో కలిసి మంత్రి తాక్కెళ్లగూడెం గొత్తికోయగుంపులో పాఠశాల భవనాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారి పూణెం తులసి కోరిక మేరకే గ్రామంలో పాఠశాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. నీకేం కావాలని అడగ్గానే తమ గ్రామానికి పాఠశాల కావాలని ఆ చిన్నారి చెప్పడం తననెంతో ప్రభావితం చేసిందని మంత్రి ఆనందాన్ని వ్యక్తం చేశారు. గూడెంలో పాఠశాలను నిర్మించాల్సిన ఆవశ్యకతను ఎస్పీ శబరీశ్‌కు వివరించానన్నారు. అటవీ శాఖ అనుమతులతో 15 రోజుల్లో రూ.8.5లక్షలతో భవన నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. దీనికి డాక్టర్ తరుణ్‌రెడ్డి రూ.1.50లక్షలు ఆర్థిక సాయం అందించగా రూ.3లక్షలు ఎస్పీ సమకూర్చారని, కలెక్టర్ నిధుల నుంచి రూ.4లక్షలు కేటాయించారని వివరించారు. తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డితో పాటుగా శ్రమించిన తాడ్వాయి పోలీసు బృందాన్ని ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. ఎస్పీ శబరీశ్ మాట్లాడుతూ 31కుటుంబాలు ఉన్న తక్కెళ్లగూడెం ప్రజల జీవితాల్లో అక్షర వెలుగులు నింపడానికి ఈ పాఠశాల దోహదపడుతుందన్నారు. పిల్లలే కాకుండా పెద్దలు కూడా ఖాళీ సమయంలో అక్షరాభ్యాసం చేయాలని సూచిం చారు. అలాగే గూడెం వాసులకు హనుమకొండలోని చక్రవర్తి హాస్పిటల్‌లో ఉచితంగా వైద్య సేవలు అందించనున్నట్టు తెలిపారు. అనంతరం మంత్రి సీతక్క చేతుల మీదు గా గొత్తికోయ పిల్లలకు పుస్తకాలు, స్కూల్ యూనిఫాం పంపిణీ చేశారు.

గూడెంలో మంత్రి పుట్టిన రోజు వేడుకలు

ఎస్పీ శబరీశ్ ఆధ్వర్యంలో తక్కెళ్లగూడెంలో మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు జరిగాయి. గూడెం వాసులతో కలిసి కేక్ కట్ చేసిన సీతక్క పిల్లలకు, పెద్దలకు, పోలీసులకు, కార్యకర్తలకు పంచారు. కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్, సీఐ జి.రవీందర్, పోలీసులు సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

- ఇల్లు అమ్మినా తీరని ఆర్థిక ఇబ్బందులు
- భీమదేవరపల్లి మండలం వంగరలో విషాదం



సునీత మృతదేహం

భీమదేవరపల్లి, జూలై 9 : వారికి ఎలాంటి వ్యవసాయ భూమి లేదు. భార్యభర్త ఇద్దరూ కష్టపడి పనిచేసుకునేవారు. ఈ క్రమంలోనే ఆ మహిళ కౌలు రైతుగా మారింది. నాలుగెకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని భర్తతో కలిసి పంటలు సాగు చేసింది. అలాగే తన కూతురు వివాహం కూడా చేసింది. కానీ గతేడాది వర్షాలు కురవకపోవడంతో పత్తి, వరి పంటలు ఎండిపోయి ఆ దంపతులు తీవ్ర నష్టాల పాలయ్యారు. అటు పంట పెట్టుబడులు.. ఇటు కూతరు వివాహం కోసం చేసిన అప్పులు మొత్తం రూ. 15లక్షలయ్యాయి. చివరకు ఆ అప్పు తీర్చే దారిలేక తమ సొంత ఇంటిని అమ్మారు. అయినా ఆర్థిక సమస్యకు పరిష్కారం దొరకలేదు. దీంతో దంపతులిద్దరూ తీవ్ర మనోవేదనలో ఉన్నారు. ఈ క్రమంలోనే ధైర్యం చెడిన ఆ ఇల్లాలు క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాద సంఘటన భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో జరిగింది. వంగర ఎస్ఐ నీలోజు వెంకటేశ్వర్లు కథనం ప్రకారం వంగర గ్రామానికి చెందిన ఏలూరి సునీత(40), శ్రీనివాస్‌రెడ్డి దంపతులకు కూతురు, కుమారుడు ఉన్నారు. ఎలాంటి వ్యవసాయ భూమి లేకపోవడంతో వారు నాలుగెకరాల భూమిని కౌలు తీసుకొని గతేడాది పత్తి, వరి పంటలు వేశారు. కానీ తీవ్ర వర్షాభావ పరిస్థితులతో పంటలు పూర్తిగా ఎండిపోయాయి. కళ్ల ముందే పంటలు ఎండిపోవడంతో భూమి యజమానికి చెల్లించాల్సిన కౌలు డబ్బులు, పెట్టుబడిగా తెచ్చిన అప్పులు మరింత భారంగా మారాయి. అలాగే అదే ఏడాది కూతురు వివాహం కూడా చేయడంతో వారు చేసిన అప్పులు రూ.15లక్షలయ్యాయి. ఇటీవల అప్పులిచ్చిన వారి నుంచి ఒత్తిళ్లు పెరగడంతో గత్యంతరం లేక తాము నివసిస్తున్న ఇంటిని రూ.7లక్షలకు విక్రయించి అప్పులు చెల్లించగా.. మరో రూ.8లక్షలు తీర్చే దారిలేకుండా పోయింది. ఇదే మనోవేదనలో భార్యభర్తలిద్దరూ ఉండగా మంగళవారం తెల్లవారు జామున సునీత ఇంట్లో ఉన్న క్రిమిసంహారక మందు తాగింది. ఉదయం సమయంలో నిద్రలేచిన భర్త శ్రీనివాస్‌రెడ్డి సునీత అపస్మారక స్థితిలో ఉండటాన్ని చూసి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. సునీత మృతితో వంగరలో విషాద ఛాయలు అలముకోగా.. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. భర్త శ్రీనివాస్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

సందడిగా జిల్లా స్థాయి స్విమ్మింగ్ ఎంపికలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హాజరైన 40 మంది క్రీడాకారులు



జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులతో స్విమ్మింగ్ అసోసియేషన్ బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్, జూలై 9 : వరంగల్ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ బాలసముద్రంలోని డీఎస్ఏ స్విమ్మింగ్‌పూల్‌లో ఏర్పాటు చేసిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి స్విమ్మింగ్ ఎంపిక పోటీలు మంగళవారం సందడిగా ప్రారంభమయ్యాయి. సబ్‌జూనియర్స్, జూనియర్స్ బాలబాలికల విభాగంలో నిర్వహించిన పోటీలలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 40మంది బాలబాలికలు పాల్గొనడం జరిగిందని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి స్వామిచరణ్ తెలిపారు. ఇక్కడ జిల్లా స్థాయిలో ఫ్రీస్టైల్, బ్యాక్‌స్ట్రోక్, బ్రెస్ట్‌స్ట్రోక్ బటర్‌ఫ్లై, ఇండివిజువల్ మిడ్‌లే విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 13, 14 తేదీలలో సికింద్రాబాద్‌లోని జీహెచ్ఎంసీ స్విమ్మింగ్‌పూల్‌లో నిర్వహించనున్న అంతర్ రాష్ట్రాల సబ్‌జూ నియర్స్ జూనియర్స్ బాలబాలికల స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా చైర్మన్ సునీల్‌రెడ్డి, అధ్యక్షుడు కందు కూరి రాజేంద్రప్రసాద్, సభ్యులు కందుకూరి సంజయ్‌కృష్ణ, డీఎస్ఏ స్విమ్మింగ్ కోచ్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా.. గోరింట

- ఆషాఢంలో మహిళల ఆభరణం
- పలు వ్యాధులకు చక్కని ఔషధం



బచ్చన్నపేట, జూలై 9: ఆషాఢం అనగానే మహిళలకు గుర్తుకు వచ్చేది గోరింటాకు. చిన్నారుల నుంచి వయస్సు పైబడిన మహిళలు సైతం గోరింటాకును పెట్టుకోవటానికి ఇష్టపడతారు. వివాహాలు, శుభకార్యాలు రాగానే తొలుత గోరింటాకుకు ప్రాధాన్యతనిస్తారు. ఆషాఢ మాసంలో లేత గోరింటాకులను మెత్తగా రుబ్బి పెట్టుకుంటే బాగా పండుతుందంటారు. గోరింటాకు శాస్త్రీయ నామం లోసోనియా ఇన్నెర్‌మిస్. దీనికి అరబిక్ పేరు హెన్నా. మెహందీగా ఇది సుప్రసిద్ధం. గోరింటాకు వేల ఏళ్ల నాటి నుంచి వాడుకలో ఉందని చెబుతారు. ఇది అలంకరణ కోసమే కాకుండా ఔషధంగా కూడా పనికొస్తుందని నమ్ముతారు. ఆకులను మెత్తగా రుబ్బి ఇందులో కాస్త చింతపండు, పెరుగు కలుపుతారు. అలా తయారైన గోరింటాకు చూర్ణాన్ని చేతులు, పాదాలపైనా మహిళలు పలు రకాల డిజైన్లలో పెట్టుకుంటారు. ఈ గోరింటాకులో హన్నోటిక్ ఆమ్లం ఉంటుంది. ఇది చర్మంలోని కొల్లాజల్ అనే రసాయనంతోనూ, వేలిగోళ్లు, వెంట్రుకల్లో ఉండే కెరాటిన్‌తో బంధం ఏర్పర్చుకోవడంతో ఎర్రగా పండుతుంది. గోరింటాకు గోరింటాకు పువ్వు, ఆకులు, వేర్లు, విత్తనాలను చూర్ణంగా చేసుకుని పెట్టుకోవడం ద్వారా పలు రకాల చర్మ వ్యాధులు, వెంట్రుకలు రాలకుండా ఉండేందుకు, చుంద్రు తొలగించేందుకు, కేశాలంకరణకు ఔషధంగా ఉపయోగిస్తారు.

ఆయుర్వేద, ప్రకృతి వైద్య నిపుణులు చెప్పే ఉపయోగాల్లో కొన్ని..

గోరింటాకు అలంకరణకు, అందానికి మాత్రమే కాకుండా ఆరోగ్యానికి మేలు చేస్తుందని ఆయుర్వేద నిపుణలు చెబుతారు. జ్వరంతో బాధపడుతున్న వ్యక్తి శరీరానికి గోరంటాకు పూయటం వల్ల శరీర ఉష్ణోగ్రత అదుపులోకి వస్తుందని, బాగా నూరిన గోరింటాకును నొప్పిగా ఉన్న కీళ్లపై పెట్టి కట్టు కట్టడం ద్వారా అదుపు చేయవచ్చని చెబుతున్నారు. గోరింటాకును వెనిగర్, నిమ్మరసంతో కలిపిన మిశ్రమాన్ని అనారోగ్యం ద్వారా వచ్చే పాదాల మంటలను అరికట్టేందుకు వాడుతారని, నోటిపూతతో బాధపడేవారు గోరింటాకు కషాయం నోటిలో వేసుకుని పుక్కిలిస్తే తగిన ఫలితం కనిసిస్తుందంటున్నారు. ఇక గోరింటాకు యాంటీబయోటిక్ లక్షణాలను కలిగి ఉండటం మూలంగా కాళ్లకు, చేతులకు పెట్టుకోవడం ద్వారా క్రిములు దరిచేరకుండా ఉంటాయని, దీని





నుంచి ఉత్పత్తయ్యే లాసోస్ అనే రంగు పదార్థం సూక్ష్మజీవులను నశింపజేస్తుందని పేర్కొంటున్నారు. గోరింటాకు పువ్వులు సుఖనిద్రను పెంచి తలనొప్పిని దూరం చేయడానికి ఉపయోగపడతాయని, గోరింట చెట్టు బెరడు పచ్చకామెర్లకు, కాలేయ వాపు తీవ్రత తగ్గించడానికి వినియోగిస్తారని, లేత గోరింట పండ్ల నుంచి తయారు చేసిన చూర్ణం శరీరంపై వచ్చే దురదను అదుపు చేస్తుందని చెబుతున్నారు.

గూడూరు అడవిలో నెమలి సంచారం



గూడూరు అటవీప్రాంతంలో సంచరిస్తున్న నెమలి

గూడూరు (మహబూబాబాద్ జిల్లా), జూలై 9 : గూడూరు శివారు చంద్రుగూడెం అటవీ ప్రాంతంలో మంగళవారం జాతీయపక్షి నెమలి సంచారం కన్పించింది. అటవీ శాఖ అధికారుల ర క్షణ చర్యల్లో భాగంగా వన్యప్రాణులు, పక్షులు సంచారం ఎక్కువగా కన్పిస్తోంది. తాజాగా చంద్రుగూడెం అటవీప్రాంతంలో నెమలి కన్పించడంతో చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది.

వినూత్న వైద్య సేవలు

- ఏజెన్సీ ప్రాంత గిరిజనుల కోసం కంటైనర్ ఆస్పత్రి
- నేటినుంచి అందుబాటులోకి..

తాడ్వాయి, జూలై 9: ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని పోసాపూర్‌లో కంటైనర్ ఆస్పత్రి ఏర్పాటైంది. ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులకు అత్యాధునికంగా వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో ములుగు కలెక్టర్ టి.ఎస్.దివాకర, డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య ఆధ్వర్యంలో దీనిని అందుబాటులోకి తెస్తున్నారు. వర్షాకాలంలో తాడ్వాయి మండలంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో గల బందాల, పోసాపూర్, అల్లిగూడెం, నర్సాపూర్, బొల్లెపల్లి, తదితర గ్రామాలకు వరదల కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ఈప్రాంత గిరిజనులకు వైద్యసేవలకు సైతం ఆటంకం కలుగుతోంది. గతంలో పలువురు అనారోగ్యాలతో మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. వర్షాకాలంలో వైద్యబృందం ఆ గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది. ఈక్రమంలో ముందస్తు జాగ్రత్తలో భాగంగా ఒక కంటైనర్‌లో నాలుగు బెడ్లు ఏర్పాటు చేసి వైద్యసేవలతోపాటు సుఖ ప్రసవాలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. అత్యవసర చికిత్సలు అందించేందుకు వైద్యబృందం నాలుగు నెలలపాటు సిద్ధంగా ఉంటారు. ఈ సీజన్‌లో వివిధరకాల రోగాలకు రక్తనమూనాలు సేకరించి రోగనిర్ధారణ పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తారు. ఈ అదనపు ఆస్పత్రిలో ఒక వైద్యాధికారితోపాటు ల్యాబ్ టెక్నీషియన్, ఏఎన్ఎం, స్టాఫ్‌నర్సు, ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉంటారు. కలెక్టర్ ప్రత్యేక చొరవతో కంటైనర్ ఆరోగ్య ఉపకేంద్రాన్ని సుమారు రూ.7లక్షల వ్యయంతో హైదరాబాద్‌లో రూపొందించి పోసాపూర్‌కు తరలించి సిద్ధంగా ఉంచారు. దీనిపై ఏజెన్సీ ప్రాంత గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





పోసాపూర్‌లో ఏర్పాటుచేసిన కంటైనర్ ఆస్పత్రి. ఆస్పత్రిలో బెడ్లను ఏర్పాటు చేసిన సిబ్బంది

గిరిజనుల జోలికి వస్తే సహించేది లేదు

● భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి ● ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు భీమానాయక్


సమావేశంలో మాట్లాడుతున్న గుగులోతు భీమానాయక్

గూడూరు, జూలై 9 : గిరిజనుల భూముల జోలికి వస్తే సహించే ప్రసక్తేలేదని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు భీమానాయక్ అన్నారు. గూడూరు మండలకేంద్రంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట మంగళవారం భూ నిర్వాసితులతో కలిసి, విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమానాయక్ మాట్లాడుతూ గూడూరు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణం కోసం 8.30 ఎకరాల గిరిజనుల సాగు భూములను తీసుకున్నారని చెప్పారు. న్యాయం కోసం పోరాటం చేస్తున్న గిరిజన హోంగార్డును ఎలా సస్పెండ్ చేస్తారని ప్రశ్నించారు. ఒకవైపు భూమి కోల్పోవడంతో పాటు మరోవైపు ఉద్యోగం కూడా కోల్పోవడం బాధకరమన్నారు. గిరిజనులపై ఎందుకింత వివక్షత అని ప్రశ్నించారు. తక్షణమే హోంగార్డు శంకర్‌ను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి తేజావత్ వాసునాయక్ మాట్లాడుతూ.. ఏజెన్సీ మండలాల్లో 1/70, పీసాచట్టాన్ని అమలు చేయని అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. భూ నిర్వాసితుల భూమిని గుంజుకుంటే ఊరుకునేదే లేదన్నారు. భూమికి భూమి ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, నష్టపరిహారం కానీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు రాందాస్‌నాయక్, బానోత్ శ్రీను, బానోతు చందులాల్, బానోత్ రామన్ననాయక్, గుగులోతు చెర్రి, శివవర్మ, భూక్యా పద్మ, భూ నిర్వాసితులు భూక్యా కమలమ్మ, భూక్యా నాగమణి, భూక్యా ఆశ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటాలి

● నేటి మొక్కలే రేపటి మానవాళికి మనుగడ

● మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, జూలై 9 : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ పరిధి జమాండ్లపల్లి సమీపంలోని జిల్లా అటవీశాఖ కార్యాలయంలో మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు నాటిన మొక్కలే రేపటి మానవాళి మనుగడకు రక్షణగా నిలుస్తాయని చెప్పారు. వనమహోత్సవంలో అంతా ప్రజలంతా పాల్గొని మొక్కలు నాటి విజయవంతం చేయాలని సూచించారు. జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో, జిల్లా అటవీశాఖ అధికారి బి.విశాల్ కాంగ్రెస్ నాయకులు చుక్కల ఉదయ్‌చందర్, ఎడ్ల రమేష్, ఆరెందుల వెంకటేశ్వర్లు, చిట్యోజు రవీంద్రాచారి, బెల్లం కొండ శ్రీనివాస్, బాబురావు, నర్సయ్య, శంతన్ రామరాజు, నారాయణసింగ్, పాల్గొన్నారు.


జిల్లా అటవీశాఖ కార్యాలయంలో మొక్కను నాటుతున్న మురళీనాయక్, అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో

ముదిరాజుల అభ్యున్నతికి కృషి ..

ముదిరాజుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముదిరాజుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అమలు చేసే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ముదిరాజ్ మహాసభ నాయకులు గొడుగు శ్రీనివాస్, నీలం దుర్గేష్, చిల్లా సహదేవ్, భాస్కర్, కొత్తూరు రమేష్, సూరయ్య వెంకన్న, నాగేశ్వర్‌రావు, సైదులు, ఐలయ్య పాల్గొన్నారు.

ఎంపీయూపీఎస్‌లో నోట్‌బుక్స్ పంపిణీ..

మహబూబాబాద్ పట్టణంలోని ఎంపీయూపీఎస్‌లో అవనీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మురళీనాయక్ చేతుల మీదుగా విద్యార్థులకు నోట్ బుక్స్ అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదల, క్రమ శిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని చెప్పారు. హెచ్‌ఎం సోమయ్య, ఉపాధ్యాయులు టి.ప్రవీణ కుమార్, కె. రవీందర్, విజయలక్ష్మి, సుగుణ, గీతావాణి, హైమావతి పాల్గొన్నారు.

'నియోజకవర్గానికి 'ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్'


ప్రభుత్వ జూనియర్ కళాశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం, జూలై 9 : మహబూబాబాద్ నియోజకవర్గంలో ఐదో తరగతి నుంచి పీజీ వరకు 25 ఎకరాల్లో ఒకే చోట ఉండే 'ఇం టిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ హబ్' ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు ఎమ్మెల్యే మురళీనాయక్ తెలిపారు. కేసముద్రానికి మంజూరైన డిగ్రీ కళాశాలను తాత్కాలికంగా స్థానిక జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసేందుకు ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం కేసముద్రం స్టేషన్ హైస్కూల్, బస్టాండ్‌లను పరిశీలించి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల అభ్యున్నతి కోసం వినూత్నంగా ఐదు నుంచి పీజీ వరకు విద్యతోపాటు ఉపాధి అవకాశాలు లభించే విధంగా సమీకృత విద్యాసముదాయాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటుకు రూ.100 కోట్లతో మంజూరు కోసం ప్రతిపాదించినట్లు చెప్పారు. టీపీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రూనాయక్, డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, బండారు దయాకర్, కదిరె సురేందర్, భట్టు శ్రీను, చిలువేరు సమ్మయ్యగౌడ్, రావుల మురళి, పొలెపల్లి వెంకటరెడ్డి, అల్లం గణేష్, తహసీల్దార్ దామోదర్, హెచ్‌ఎం రాజు పాల్గొన్నారు. అనంతరం కేసముద్రంలో స్మశానవాటిక కోసం స్థలాన్ని కేటాయించాలని పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా అధ్యక్షుడు పిల్లి కుమారస్వామి, మండల అధ్యక్షుడు అప్పాల పేతురు, ప్రభుజీవన్, ఇస్లావత్ సాల్మన్‌రాజు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

హైస్కూల్‌ను తనిఖీ చేసిన డీఈవో

కేసముద్రం, జూలై 9 : మండలంలోని తాళ్లపూసపల్లి జడ్పీహైస్కూల్‌ను మంగళవారం డీఈవో రామారావు తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులను, తరగతిగదుల్లోకి వెళ్లి విద్యార్థులను పరిశీలించారు. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఆయన వెంట హెచ్‌ఎం కనకయ్య ఉన్నారు.

ఔటర్ రింగురోడ్డు కోసం ప్రతిపాదనలు

● మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, జూలై 9 : జిల్లా కేంద్రం చుట్టూ ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్‌ఆర్) నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపుతున్నట్లు స్థానిక మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ కార్యాలయంలో మంగళవారం ఫ్లోర్ లీడర్లు, అధికారులు, కౌన్సిలర్లు సమావేశమై ఔటర్ రింగ్‌రోడ్ నిర్మాణ ప్రతిపాదనపై చర్చించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఔటర్ రింగు రోడ్ విషయంపై ఇటీవల జరిగిన మునిసిపల్ కౌన్సిల్‌లో ఎమ్మెల్యే మురళీనాయక్ దృష్టికి తీసుకువెళ్లామని అందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారని చెప్పారు. అందులో భాగంగానే అధికారులు, పాలకమండలి సభ్యులతో చర్చించి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించనున్నామని పేర్కొన్నారు. వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, డీఈ ఉపేందర్, ఫ్లోర్‌లీడర్లు వెన్నం లక్ష్మారెడ్డి, చిట్యాల జనార్ధన్, సూర్నపు సోమయ్య, బి. అజయ్‌సారథిరెడ్డి, కౌన్సిలర్లు పోతురాజు రాజు, బానోత్ పద్మసీతారాంనాయక్, దండెబోయిన బుజ్జివెంకన్న, మార్నేని శ్రీదేవిరఘు, డౌలాగర్ స్వాతిశంకర్ పాల్గొన్నారు.


మునిసిపల్ కార్యాలయంలో ఫ్లోర్‌లీడర్లు, అధికారులతో చర్చిస్తున్న రాంమోహన్‌రెడ్డి

సీసీ రోడ్లు నిర్మించాలని ధర్నా


కంకరరోడ్డుపై నిరసన తెలుపుతున్న కాలనీ వాసులు

తొర్రూరు, జూలై 9 : తొర్రూరు పట్టణంలోని బీరప్ప నగర్ నలంద స్కూల్ బజారు, చెరువు కట్ట వద్ద, పట్టణంలోని వివిధ వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వెంటనే రోడ్ల నిర్మాణం చేపట్టి డ్రైనేజీలు నిర్మించాలని కాలనీ వాసులు రోడ్డుపై ధర్నా చేశారు. ఈసందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణం కోసం మునిసిపల్ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సర నవంబర్‌లో రోడ్డు, సైడ్ డ్రైనేజీ నిర్మిస్తామని కంకరపోసి వదిలేశారని, ఇప్పటివరకు ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలని, రాత్రి వేళల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈకార్యక్రమంలో కాలనీవాసులు కొరివి సుధాకరాచారి, శోభన్ బాబు, సుగుణమ్మ, మల్లయ్య, పద్మ, మానస, మధూకర్ రెడ్డి, శారదన్, కోటేశ్వర్ రావు, ఎం. అనిత ఉన్నారు.

పోక్సో, అత్యాచారం కేసులో యువకుడి అరెస్ట్

కొత్తగూడ, జూలై 9 : బాలికపై అత్యాచారం చేసిన కేసులో మంగళవారం యువకుడిని అరెస్ట్ చేసినట్టు ఎస్సై దిలీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. కొత్తగూడ మండల కేంద్రానికి చెందిన బాలికపై ఈనెల 5న కొత్తగూడ గ్రామానికే చెందిన పొడిశెట్టి సాయి అత్యాచారం చేశారు. ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు తెలుపడంతో బాధితురాలి తండ్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో సాయిపై పోక్సో అత్యాచారం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. సాయిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై దిలీప్ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

చిన్నగూడూరు, జూలై 9 : మండల కేంద్రంలో అల్లం వెల్లుల్లి వ్యాపారం పేరుతో రేషన్ బియ్యం కొని, రైస్‌మిల్లరకు సరఫరా చేస్తున్న వ్యక్తిని మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై ఝాన్సీ తెలిపిన వివరాల ప్రకారం. చిన్నగూడూరులో యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలానికి చెందిన భూక్యా శ్రీను 40 బస్తాల (10 క్వింటాళ్ల) రేషన్ బియ్యం ఆటోలో తరలిస్తుండగా పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఆటో సీజ్‌చేసి అతడిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

● జిల్లా వైద్యాధికారి కళావతిబాయి

సీరోలు, జూలై 9 : సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి కళావతిబాయి అన్నారు. కాంపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కళావతిబాయి మాట్లాడుతూ..ప్రతి రోజు సకాలంలో విధులు హాజరై వర్షాకాలంలో వచ్చే అంటువ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. సబ్ సెంటర్ పరిధిలో ప్రతి గర్భవతిని తప్పకుండా కురవి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గాని మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కానీ కాన్పు చేయించాల్సిందిగా ఆదేశించారు. క్షయవాధి లక్షణాలు ఉన్న వ్యక్తులను గుర్తించి వారికి సక్రమంగా మందులు అందించాలని, అనుమానితులను తెమడ పరీక్షకు పంపించాలన్నారు. సబ్ సెంటర్ పరిధిలో ఎంతమంది కుష్టువ్యాధిగ్రస్తులున్నారో తెలుసుకొని వారికి ప్రతి రోజు మందులు అందించాలన్నారు. ఫైలేరియా కేసుల గురించి తెలుసుకొని సరైన చికిత్స అందించాలని సూచించారు.

'కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'


వెలికట్టె జీపీ ఎదుట నిరసన తెలుపుతున్న చేస్తున్న కార్మికులు

తొర్రూరు, జూలై9 : గ్రామపంచాయతీల్లో పనిచేసే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పాండ్య బీకూ అన్నారు. మంగళవారం మండలంలోని వెలికట్టె గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీల్లో పనిచేసే 60 వేలమంది సిబ్బందికి వేతన బకాయిలు చెల్లించి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈనెల 11న పంచాయతీ రాజ్ కమిషనరేట్ ముట్టడిని జయప్రదం చేసేందుకు కార్మికులు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. సోమ నర్సయ్య ప్రమోద్, వెంకటయ్య, మల్లయ్య, రాజు పాల్గొన్నారు.

కళాశాలకు నూతన భవనం నిర్మించాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 9 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు నూతన భవనం నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక కళాశాలను మంగళవారం సందర్శించి కళాశాల భవనాన్ని పరిశీలించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల భవనం శిథిలావస్థకు చేరుకుందని అయినా పట్టించుకునే వారు లేరని తెలిపారు. గుగులోతు సూర్యప్రకాష్, హరీష్ మహేష్, వినయ్ పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంకులో పడిన బాలుడు

(5వ పేజీ తరువాయి)

కోసం ఆస్పత్రి ఆవరణలోని సెప్టిక్ ట్యాంక్ గల ప్రదేశానికి వెళ్లాడు. ట్యాంక్ మూతతెరిచి ఉండడంతో విలియమ్స్ ప్రమాద వశాత్తు అందులో పడిపోయాడు. ఈ విషయాన్ని గమనించిన తల్లి కేకలు వేయడంతో ఆస్పత్రి సిబ్బంది బాలుడిని బయటకు తీశారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రథమ చికిత్స అనంతరం కరీంనగర్ లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్‌లో వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ రమాకాంత్‌ను వివరణ కోరగా, సెప్టిక్ ట్యాంకుపై మూత తెరిచి ఉన్న కారణంగానే బాలుడు అందులో పడ్డాడని తెలిపారు. ఈ ఘటనపై విచారణ జరుపుతున్నామని వివరించారు.


మరిపెడ పీఎస్‌లో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ హథిరామ్

'రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి'

మరిపెడ, జూలై 9 : రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని మరిపెడ సీఐ హథిరామ్ అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రౌడీషీటర్లకు ఆయన కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. రౌడీషీటర్లు గ్రామాల్లో ఎలాంటి అలజడులు సృష్టించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సెటిల్‌మెంట్లు, భూ తగాదాలలో జోక్యం చేసుకొవద్దన్నారు. సత్ప్రవర్తనతో మెలిగి సమాజ శ్రేయస్సు కోరితే షీట్లు ఎత్తివేసే అవకాశం ఉంటదన్నారు. ఈ కౌన్సిలింగ్‌లో మరిపెడ ఎస్సైలు తహెర్‌బాబా, సంతోష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● నర్సింహులపేట : రౌడీ షీట్ కేసు ఉన్న నేరస్తులు తీరు మార్చుకోకపోతే పీడీ యాక్టు నమోదు చేయడం జరుగుతుందని తొర్రూరు సీఐ సంజీవ హెచ్చరించారు.స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో రౌడీషీట్ కేసు ఉన్న నేరస్తులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రస్తుతం వారుఎక్కడ ఉంటున్నారు, ఏ పని చేస్తున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన నూతన చట్టాలు నేరస్తులపై ఉక్కుపాదం మోపేలా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎస్సై సతీష్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కానిస్టేబుల్ దూషించాడని యువకుడి ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న ఉదయ్‌కుమార్

మహబూబాబాద్ రూరల్, జూలై9 : కానిస్టేబుల్ దూషించడంతో మనస్తాపానికి చెం దిన ఓ యువకుడు ఆత్మహత్యాయత్నం చేసుకు న్న ఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. చేపల మార్కెట్‌కు చెందిన విజయ్‌కుమార్-సునీత దంపతుల కుమారుడు ఉదయ్‌కుమార్ (25) గత మూడేళ్ల క్రితం కురవి మండలం బలపాలకు చెందిన వీరన్నకు రూ.12 లక్షలు, 3 తులాల బంగారం అప్పుగా ఇచ్చారు. మా డబ్బులు మాకు ఇవ్వడంలేదని గత ఆరు నెలలక్రితం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికి, అతడిపై చర్యలు తీసుకోవడం లేదంటూ మంగళవారం మధ్యాహ్నం ఉదయ్‌కుమార్ తన తల్లితో టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. ఈ క్రమంలో ఓ కానిస్టేబుల్ దూషించడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఇంటికి వెళ్లిన ఉదయ్‌కుమార్ మంగళవారం రాత్రి మత్తుగోళీలు మింగాడు. గమనించిన కుటుంబసభ్యులు జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఉదయ్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు తెలిపారు.

'సస్యరక్షణ చర్యలు పాటించాలి'

నర్సింహులపేట, జులై 9 : పత్తిలో సస్యరక్షణ చర్యలు పాటిస్తేనే అధిక దిగుబడులు సాధ్యమని మండల వ్యవసాయ విస్తరణ అధికారి రామకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని పడమటిగూడెంలో ఆయన పర్యటించారు. పత్తిలో రసంపీల్చు పరుగు నియంత్రణకు పత్తిమొక్క కాండానికి బొట్టుపెట్టే విధానాన్ని రైతులకు వివరించి, సలహాలు, సూచనలు ఇచ్చారు. ఏఈవో కరిష్మా, రైతులు అలువాల మధు, రాములు, యాకన్న, గందసిరి శివలింగం, వెంకన్న పాల్గొన్నారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలు

తొర్రూరు, జూలై 9 : అఖిల భారత విద్యార్థి పరిషత్ 76వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం డివిజన్ కేంద్రంలోని ఘనంగా నిర్వహించారు. పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టి జెండా ఆవిష్కరించి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు జి.సిద్ధు మాట్లాడారు. జి.శ్రీనివాస్, పల్లె కుమార్, గణేష్, రమేష్, మహేష్, సాయి, రవి, శివ, మనోజ్, హారతి, సరిత పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా రైతు అవగాహన సదస్సు

చిన్నగూడూరు, జూలై 9 : ఉగ్గంపల్లి రైతు వేదిక నందు మంగళవారం రైతులకు సమాచారం లేకుండా శాస్త్రవేతలచే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతుల అవగాహన సదస్సు నిర్వహించడంపై మండల రైతులు వ్యవసాయ అధికారుల తీరుపై అగ్రహం వ్యక్తం చేశారు. ఆలస్యంగా ఈ విషయం తెలుసుకున్న మండల రైతులు వ్యవసాయ అధికారులను నిలదీయడంతో సోషల్ మీడియాలో సమాచారం ఇచ్చామని అధికారులు తెలపగా వారు ఆశ్చర్యపోయారు. ఈ విషయంపై ఏఈవో విష్ణు వివరణ కోరగా ఉన్నతాధికారుల నుంచి తమకు ఆలస్యంగా సమాచారం రావడంతో రైతులకు సమాచారం సోషల్ మీడియాలో ఇచ్చామని తెలిపారు.

'మైనార్టీ గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 9 : జిల్లాలోని డోర్నకల్, తొర్రూరు బాలికల మైనార్టీ గురుకుల పాఠశాలల్లో 5, 6, 7, 8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశం పొందేందుకు ఈనెల 15 లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ అధికారి బి.శ్రీనివాస్‌రావు మంగళవారం తెలిపారు. డోర్నకల్ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ఎస్సీ-4, బీసీ-1, ఓసీ-1, 6వ తరగతిలో ఎస్సీ-3, బీసీ-3, ఓసీ-1, 7వ తరగతిలో ఎస్సీ-1, ఓసీ-1, 8వ తరగతిలో ఎస్సీ-2, బీసీ-4, ఓసీ-1, తొర్రూరు పాఠశాలలో 6వ తరగతిలో ఎస్సీ-3, 7వ తరగతిలో ఎస్సీ-3, 8వ తరగతిలో ఎస్సీ-2, బీసీ-1 మొత్తం 32 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 18 లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఇతర వివరాలకు డోర్నకల్ ప్రిన్సిపాల్ సెల్ నెంబర్: 79950 57927, తొర్రూరు ప్రిన్సిపాల్ సెల్ నెంబర్ : 79950 57928లను సంప్రదించాలన్నారు.

గ్రామపంచాయతీ సిబ్బంది నిరసన

కేసముద్రం, జూలై 9 : తొమ్మిది నెలలుగా వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని జీతం అడిగితే తొలగిస్తామని పంచాయతీ కార్యదర్శి బెదిరిస్తున్నారని ఆరోపిస్తూ సిబ్బంది విధులను బహిష్కరించి కేసముద్రం విలేజి జీపీ ఎదుట సిబ్బంది మంగళవారం నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ జీతం అడిగితే తొలగిస్తామని తమను బెదిరిస్తున్నారని ఆరోపించారు. వేతనాలు లేక ఆర్థిక ఇబ్బందులతో కాలం వెళ్లదీస్తున్న తమకు వేతనాలివ్వాలని, అప్పటి వరకు పనులు చేసేది లేదని తేల్చిచెప్పారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీవో ప్రసాద్ జీపీ సిబ్బందికి వేతనాలిప్పిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమిం చారు. అనీల్, అశోక్, శ్రీను, యాకయ్య, ప్రమోద్, శివ, సంజీవ, మరియమ్మ, జ్యోతి, జయంత, అలివేల, సూరమ్మ, సంగీత్, లక్ష్మణ్, లింగమ్మ పాల్గొన్నారు.

'బడుల్లో స్కావెంజర్లను నియమించాలి'


పర్వతగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు చేస్తున్న టీఎస్ యూటీఎఫ్ నేతలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 9 : ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని టీఎస్-యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పర్వతగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లు లేకపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని, వెంటనే ప్రభుత్వం వారిని నియమించాలన్నారు. ఎంతో కాలంగా ఉపాధ్యాయులు ఎదురు చూసిన పదోన్నతులు, బదిలీలు చేపట్టిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హరినాయక్, శ్రీనివాస్, కుమార్, మైసయ్య, ప్రసాద్, రాజశేఖర్, రంజాన్, షబ్బీర్, భరత్‌కుమార్ పాల్గొన్నారు.

గాయకులకు 'ఉద్యమ గానకోకిల' అవార్డులు



కె.వెంకన్న, బండ వెంకన్న

మహబూబాబాద్ టౌన్, జూలై 9 : తెలంగాణ ఉద్యమంలో ప్రజలను తమ పాటలతో చైతన్య పరిచి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కళాకారులుగా కీలకభూమిక పోషించిన మహబూబాబాద్ జిల్లాకు చెందిన కవి, గాయకులు కొమిరె వెంకన్న, బండ వెంకన్న, గిద్దె రాంనర్సయ్యకు ఉద్యమ గానకోకిల అవార్డులకు ఎంపికయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూమెంట్ (యూటీపీఎం) ఆధ్వర్యంలో కవులు, గాయకులకు ఉద్యమ గానకోకిల అవార్డులను అందజేస్తున్నారు. అందులో భాగంగా జిల్లాకు చెందిన ముగ్గురిని ఎంపిక చేసినట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మేకల చంద్రశేఖర్‌యాదవ్, ముక్కెర సంపత్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈనెల 12న కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగే కార్యక్రమంలో కొమిరె వెంకన్న, బండ వెంకన్న, గిద్దె రాంనర్సయ్యలు ఉద్యమ గాన కోకిల అవార్డులను అందుకోనున్నారు. వారికి అవార్డు దక్కడం పట్ల జిల్లాలోని తెలంగాణ ఉద్యమకారులు, కళాకారులు, రచయితలు హర్షం వ్యక్తం చేశారు.

రేపు పీఆర్ కమిషనరేట్ ముట్టడి

కేసముద్రం, జూలై 9 : రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న 60వేల మంది జీపీ సిబ్బందికి వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11న హైదరాబాద్ పంచాయతీరాజ్ కమీషనరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని ఇఫ్టూ జిల్లా సహాయ కార్యదర్శి కె.భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. కేసముద్రం స్టేషన్ జీపీ కార్యాలయం వద్ద మంగళవారం ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ ముట్టడికి కార్మికులు తరలిరావాలని కోరారు. మడుపు కృష్ణమూర్తి, కనకలక్ష్మి, శ్రవణ్, వెంకన్న, రమేష్ పాల్గొన్నారు.

మంత్రి సీతక్క పుట్టినరోజు వేడుకలు

కొత్తగూడ, జూలై 9 : పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క పుట్టినరోజు వేడుకలను కొత్తగూడలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ చల్లా నారాయణరెడ్డి కేక్ కట్‌చేసి కాంగ్రెస్ నాయకులకు అందించారు. నాయకులు, కార్యకర్తలు సీతక్కకు అనుకూలంగా నినాదాలు చేశారు. మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, డీసీసీ జనరల్ సెక్రటరీ బానోత్ రూప్‌సింగ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరబోయిన మొగిలి, జడ్పీటీసీ పుల్సం పుష్పలత, వైస్ ఎంపీపీ కాడబోయిన జంపయ్య కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద మొక్కను నాటారు. జిల్లా నాయకులు వీరనేని వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు రణధీర్, రాజేశ్వర్, నాయకులు తోలెం అనంతరావు, హలావత్ సురేష్, భూర్క నరేందర్, కల్తీ కొమ్మక్క, సిరిగిరి సురేష్, రాజం సాంబయ్య కట్రోజు భిక్షపతి, ప్రశాంత్, బొల్లం ఐలయ్య ఈర్యా, మౌలానా పాల్గొన్నారు.


కొత్తగూడలో కేక్‌కట్ చేస్తున్న చల్లా నారాయణరెడ్డి